# ఎర

— జె. స్వర్ణలత

"తుపానంట.. గాలి చూసావా..? ఇసిరిసిరి కొడ తొంది" గంగరాజు జేబులో చుట్టముక్క వెతుక్కుంటూ అన్నాడు.

సైదులు మొహం చిట్లించాడు. గంగరాజంటే అతనికి చిరాకు.

"పోర్టులో పని లేదేటి? సేపల మీదడ్డావు." అంటూ సైదులు పక్కనే వున్న చుట్టలోకి చూసి, "ఎటీ నాలుగేనా?" అని అన్నాడు గంగరాజు.

"గాలానికేమైనా చేపలు తగిలాయామో!" అని గాలాన్ని నీళ్ళ లోంచి లాగుతూ సైదులు సమాధానం చెప్పలేదు. సైదులుకి పని దొరికిన రోజున దొరుకుతుంది. లేని రోజు లేదు. పోర్టులో కూలీ అతను.

గంగరాజు చుట్టని కష్టంమీద వెలిగించాడు. పక్కనే వున్న సంచీలోంచి సారా పాకెట్ తీస్తూ "సుక్కేసుకుంటావేటి బామ్మర్దీ?" అన్నాడు.

పాకెట్ వైపు చూసి, నాలుక తడుపుకున్నాడు సైదులు. "మానీస్రాన్నా... మా కనకం ఒట్టేయించుకుంది" గొణిగాడు.

"ఒట్టు తీసి గట్టు మీద ఏసెయ్యరా... ఊరికే వచ్చినయ్యిలే. నీకిద్దామనే అట్టు కొచ్చా."

"వద్దులేరా... ఎదవసారా గుండెల్ని తినేత్తంది"

## 'చిత్రకథ' పోటీలో రూ. 500/- బహుమతి పొందిన కథ

"సల్లగాలి.. తుపాను... సుక్కేసుకుని.... ఇదుగో. ఈ కోడి ఏపుడు నంజుకో" చాలా ఉదారంగా అన్నాడు గంగరాజు. అతని కళ్ళల్లో ఆశ. ఉడుతపిల్లని పట్టుకోబోయే ముందు పొంచి వున్న పిల్లి కళ్ళల్లోని కుటిలత్వం. గంగరాజు బుద్ధి తెల్సి... తటపటాయించడం మొదలెట్టాడు సైదులు. పక్కలో పాము లాంటివాడు గంగరాజు. అతనావంగి, వంగి నడవడం, ఆ చూపులు... తనేకేదో ఎర వేస్తున్నాడని గ్రహించుకోలేనంత అమాయకుడేం కాదు సైదులు. కాకపోతే వ్యసనం, మనిషి మాంసానికి అలవాటు పడ్డ పులిలాంటిది. అవకాశం కోసం ఎదురుచూస్తూనే వుంటుంది. ఎంత గడియలు, గొళ్ళాలు పెట్టినా పీకుతూనే వుంటుంది. దానికి కళ్ళాలు వెయ్యాలంటే చాలా మనోబలం కావాలి.

కాసేపు తర్కించుకున్నాడు సైదులు. "నన్ను ధోసెయ్యడానికి ఏటుంది నా దగ్గర? వంటి మీద పాత పంచె... సిరిగిన బనీను. బుట్టలో నాలుగు సేప్పిల్లలు... ఓ బీడీల కట్ట." అని సమాధాన పరుచుకుని, నెమ్మదిగా చేతి వేళ్ళని పాకెట్ వైపు పాకించాడు.

సైదులు బలహీనత తెల్సిపోయింది గంగ



రాజుకి, "లాగించేరా... బామ్మర్దీ" అని హుషారు చేసాడు.

సముద్రం మీద లంగరేసుకున్న ఓడల్లో దీపాలు వెలిగాయి. గాలి విసురు మరీ పెరిగింది. చలికి డొక్కలు వంచి, మోకాళ్ళచుట్టూ చేతులు చుట్టపెట్టి కూర్చున్న గంగరాజు కళ్ళు వికృతంగా వున్నాయి.

'ముందో చుక్కేసుకుందామని' రంగంలోకి దిగిన సైదులు కడుపు నిండా తాగిగాని తృప్తి పడలేకపోయాడు. మైకం బాగా తలకెక్కింది. అవాకులు చవాకులు పేలడం మొదలెట్టాడు. గంగరాజు మాత్రం రాయిలా అలాగే చీకటి పడేవరకూ కూర్చున్నాడు. చీకటి... భూదేవి కనురెప్పలు మూసుకుంటే ఆ రెప్పల క్రింద వున్నట్లుంది. సముద్రం నిండా చీకటి. కరెంట్ పోవడంతో నగరమంతా చీకటి.

తూలుతూ దయ్యంలా లేచాడు సైదులు.

---

వ్యవధి తక్కువగా ఇవ్వడంవల్లనో,
ఏమో 'చిత్రకథ' పోటీకీ రచనలు
ఆశించిన సంఖ్యలో రాలేదు.
వచ్చిన వాటిల్లో వైవిధ్యంగానూ,
ఉత్తమంగానూ న్యాయనిర్ణేతలు
భావించి ఈ రచనను బహుమతికి
అర్హమైనదిగా ఎన్నిక చేశారు.
ఈ కథారచయిత్రిని అభినందిస్తూ,
పోటీలో పాల్గొన్న
రచయిత్రులందరికీ మా
కృతజ్ఞతలు
తెలియజేసుకుంటున్నాము.

---

గాల్లో ఎగిరే జెండాలా అటూ ఇటూ ఊగుతూ ఇంటివైపు నడవడం మొదలుపెట్టాడు.

గంగరాజు తృప్తిగా చూస్తున్నాడు. అతనిక్కావాల్సిందదే. వెనకే నడుస్తూ, "నీ కూతురికి మనువుసెయ్యవా?" ఆరాగా అడిగాడు గంగరాజు.

"ఎదురు డబ్బిచ్చి సేసుకుంటాను. నీ కూతుర్ని నాకియ్యగూడదా?"

అంత మత్తులో కూడా ఆ మాటలు ఈటెల్లా పొడుస్తున్నట్లన్పించింది సైదులుకి.

గారపళ్ళు, తాటి పీచులా జుట్టు-- "సీ... ఎదవ నా కొడకా... సందనం బొమ్మలాంటి నా కూతురికి నీ దేబిగొట్టు మొహమా? నీకిచ్చి కట్టబెట్టాల్నా?" తనలో తనే గొణుక్కున్నాడు.

'కనకం మా గొప్ప పొగరుగా వుందిలే... బుజ్జగింపుగా, మరియాదగా మాట్లాడితే నన్ను 'సీ' కొడ్తాదా?"

ఎందుకో భయం వేసింది సైదులుకి. చీకట్లో కల్సిపోతున్న గంగరాజు నడక... వెయ్యికాళ్ళ జెర్రి కదలికల్ని గుర్తుకు తెస్తోంది.

"ఆగరొరేయ్... అగు..." అరుస్తూ వెనక పడ్డాడు సైదులు.

కాలికి ఎదురురాయి తగిలింది బోర్లా పడ్డాడు... ఏడుస్తూ అరవడం మొదలుపెట్టాడు. "నా కూతుర్నేటి సెయ్యకురా.. ఎదవా... ఎదవన్నర ఎదవా..." అరుస్తున్నాడు సైదులు. నేల మీద పడి దొర్లుతున్నాడు.

* * *

భళ్ళున తెల్లారింది. తుఫాను తగ్గిపోయినట్లుంది. హోరు తగ్గించుకుని నీరసంగా, కొంచెం నిశ్శబ్దంగా వుంది సముద్రం. సూరీడు సముద్రం అంచున నిప్పు ముద్దలా ధగ ధగలాడి పోతున్నాడు.

రాత్రి జరిగిన సంఘటనలు లీలగా గుర్తుకొస్తున్నాయి సైదులుకి. గుండె గుబ గుబలాడింది. అతి కష్టం మీద లేచి, ఇంటివైపు నడవడం మొదలుపెట్టాడు.

తలంతా దిమ్ముగా వుంది. తాగుడెక్కువై కడుపులో తెర్లుతున్నట్లుగా వుంది.

గుడిసె ముందూ, లోపలా కమ్ముకున్న జనాన్ని చూడగానే మతిపోయింది సైదులుకి. అందరి చూపుల్లోను ఏదో కోపం, వెక్కిరింపు.

గుడిసెలో ఓ మూల్న నల్లరాతి విగ్రహంలా నిలబడి వుంది కనకం. తండ్రినోసారి నిప్పులు చెరిగే కళ్ళతో చూసింది.

"ఏటీ అమ్మా.. ఏటైంది?" గాభరాగా అడిగాడు సైదులు.

"ఒరే అయ్యా... నీ కడుపున పుట్టిన పాపానికి నన్ను సంపు. నరుక్కు తిను. ఎదవలందరికీ తాకట్టు ఎట్టమాక" అరుస్తోంది కనకం వెర్రెత్తినదానిలా.

దబ్బున కూలబడిపోయాడు సైదులు.

"ఓలమ్మో.. ఎంత గోరం జరిగిపోనాదే..." గొల్లున ఏడవడం మొదలుపెట్టాడు.

పదిక్షణాలలా అతన్ని బాగా ఏడవనిచ్చి, తర్వాత తండ్రి దగ్గరికి నెమ్మదిగా వచ్చింది కనకం. అతని ముందు కూలబడింది.

"అయ్యా... రేత్రి ఆ గంగరాజు రౌడీ ఎదవ ల్బేసుకొచ్చాడు. సుట్టుపక్కల మా రాజులు నన్ను కడుపులో ఎట్టుకోకపోతే ఏటయ్యేదాన్నో!"

కాస్త తెప్పరిల్లాడు సైదులు. తేలిగ్గా ఊపిరి తీసుకున్నాడు.

"నా మాటినుకుని తాగుడు మాను. ఆ మత్తులో ఏంగోరం జరిగినా ఏటీ చెయ్యలేవు నువ్వు. నీ ఎదురుగా నీ పెళ్ళాం బిడ్డల మానం తీస్తున్నా నీకు తెలవదు. మన పేటలో శానా మంది తాగుడు మానబట్టి..., నీలా మత్తులో ఏడవలేకు కాబట్టి నన్నా ఎదవల్నించి తప్పించేనారు. నేకపోతే ఈ పాటికి మట్టిగొట్టుకుపోయుండేదాన్ని."



ఆయన లేరు సార్, గ్రామాల్లో జరుగుతున్న ఐక్యవేదికల్లో పాల్గొనటానికి వెళ్లారు.



ఏం చెప్పమంటావే రంగీ, నీ మొగుడు సారాకు బానిసయ్యాడు, నా మొగుడు సారా కాంట్రాక్టర్లకు బానిసయ్యాడు. రోలువెళ్లి మద్దెలతో చెప్పుకున్నట్టుంది మనిద్దరి వ్యవహారం.



మా అమ్మాయికి సినిమా పాటలూ, ప్రైవేట్ సాంగ్సూ, స్త్రీల పాటలూ అన్నీ వచ్చు బావగారూ.. ఏమ్మా ఓ పాట పాడి వినిపించు.

('ఈనాడు' సౌజన్యంతో)